www.jananinadam.com RNI NO:TGTEL/25/A0870 Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

శనివారం 29 -08- 2026
సంపుటి : 2 సంచిక : 122

ఆసిఫాబాద్ Asifabad | హైదరాబాద్ Hyderabad | ఎడిటర్ : జాధవ్ రోహిదాస్ Editor: JADAV ROHIDAS | పేజీలు : 04 | వెల: రూ.2.00

Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



## అర్హులందరికి ఇళ్లు కేటాయిస్తాం

**లక్కీడ్రాకార్యక్రమంలోమంత్రిపొంగులేటి**

**హైదరాబాద్, ఆగస్ట్ 28:** క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ప్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కోటాయిస్తున్నారు.మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళు నిర్మించి ఇస్తామన్నారు.

2వ పేజీలో...

# ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు...

**వివాదాల తరవాత తొలిసారి సీఎం ఇంటికి కొండా సురేఖ**
**సిఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య**
**సిఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్**



**హైదరాబాద్, ఆగస్ట్ 28:** రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్ ౖ రాఖీ కట్టారు. సీఎం కుటుంబ సభ్యులు సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి.సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్రెడ్డికి మూడోసారి రాబీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. ...



## ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు : కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్

**కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల**
**సన్నబియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫొటో వేయడం లేదని మండిపాటు**
**కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెండుతున్నాయని వ్యాఖ్య**

తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని...

2వ పేజీలో...



## హట్టి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్28:** కర్ణాటకలోని హట్టి గోల్డ్ మైన్స్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఇందులో భాగంగా, అక్కడ ఉన్న యూటీ (జబితి) ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైన్ వ్యూ పాయింట్ నుండి బంగారం ముడి మట్టి వెలికితీత ప్రక్రియను డిప్యూటీ సీఎం ప్రత్యక్షంగా వీక్షించారు. గనిలో ఎంత లోతు నుంచి బంగారం ముడి సరుకును సేకరిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను ఆయన లోతుగా పరిశీలించారు. ఈ సందర్భంగా గడిచిన ఐదేళ్ల బంగారు ఉత్పత్తి వివరాలను మైనింగ్ అధికారులు డిప్యూటీ సీఎంకు నివేదించారు. యూటీ ఓపెన్ కాస్ట్‌తో పాటు, ప్రధాన భూగర్భ (అండర్‌గ్రౌండ్) గని ఉత్పత్తుల వివరాలపై కూడా ఆయన ఆరా తీశారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం వెంట సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

**ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదన్న జూపల్లి**
**ప్రజల దరఖాస్తులకు వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలని ఆదేశం**
**అధికారులు పాత పనితీరును మార్చుకోవాలని హెచ్చరిక**



**హైదరాబాద్, ఆగస్ట్ 28:** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండ కూడదని..వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా దరఖాస్తు పంపినా అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నర ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉంటారని, అందుకే పేరు, చిరునామా, ఫోన్ నంబర్తో కూడిన రాతపూర్వక ఫిర్యాదును వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా సంబంధిత

## బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

**కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరుబాటకు కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్ 28:** అవినీతిని ఎండగట్టాలి పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపువారం రోజుల ప్రత్యేక నిరసన కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్,ఒకటవ తేదీన తెలంగాణ భవన్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్‌తో ప్రజల్లోకి బీఆర్ఎస్. రెండవ తేదీ నుంచి వరుసగా కార్యక్రమాలు.. సెప్టెంబర్ 2ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు420 హామీల మోసాన్ని గుర్తుచేస్తూ భారీ ఫ్లెక్సీల ప్రదర్శనప్రజలకు బాకీ ఉన్న హామీలతో ఇంటింటికీ బాకీ కార్డుల పంపిణీ:సెప్టెంబర్ 3వ్యవసాయ విధ్వంసంపై అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులుసాగునీరు, విద్యుత్, యూరియా, బీమా సమస్యలపై రైతులతో సమావేశాలుహైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై నిరసనలు, సెప్టెంబర్ 4మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులుమహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై నిరసన కార్యక్రమాలురూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అంశాలపై నిలదీతహామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పుసెప్టెంబర్ 5విద్యార్థులు, యువతతో నియోజకవర్గ



## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

**సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత**
**నారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు**
**ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరికం**

**హైదరాబాద్, ఆగస్ట్ 28:** కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని



2వ పేజీలో...

## మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**హైదరాబాద్ 28:** మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మంత్రి పొన్నం ప్రభాకర్ కి, వారి కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి సీతక్క రాఖీ కట్టి మంత్రి పొన్నం ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీలు కట్టిన సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పౌర్ణమి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.



## చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ

**అదే కుటుంబానికి తగిలిన లక్కీ డ్రా**
**ఎక్స్లో పోస్ట్ చేసిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,ఆగస్ట్ 28:** హైదరాబాద్ లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్లో ప్లాట్ల కేటాయింపునకుఇందిరమ్మ ఇండ్లలక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియో జకవర్గంలోని మైలార్దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.

2వ పేజీలో...



# బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

మొదటిపేజీ తరువాయి...

కేంద్రాల్లో భారీ ర్యాలీలు.. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై పోరాటంఅదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులుసెప్టెంబర్ 6హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీతాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని నిలదీతగ్రామాల్లో పారిశుద్ధ్యం, పల్లెల సమస్యలపై నిరసన కార్యక్రమాలుసెప్టెంబర్ 7ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు420 హామీల మోసంపై జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులుసెప్టెంబర్ 8వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లుఅంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులుసెప్టెంబర్ 10 ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావం. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అవినీతి ఆరోపణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి చేపట్టనున్న వారం రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి వరుసగా ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్



ప్రభుత్వం వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల ముందు ఎండగట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

# అర్హులందరికి ఇళ్లు కేటాయిస్తాం

మొదటిపేజీ తరువాయి...

మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేప్రష్నుక్కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్దిదారులకు ఉ ందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

మొదటిపేజీ తరువాయి...

అధికారులకు పంపవచ్చని వెల్లడించారు. అధికారులు దరఖాస్తులను ప్రింట్ తీసుకుని వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కారం చూపాలని, ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు మూడ్రోజుల్లోనే జారీ చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అధికారులు తమ పాత పనితీరును మార్చుకోవాలని, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జూపల్లి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు



కరీంనగర్ 28: ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగుల సోదరీమణులు పుష్పలత, స్వర్ణలత, అరుణలతలు గంగుల కమలాకర్‌తో పాటు వెంకన్న, సుధాకర్‌లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. కుటుంబ సభ్యులు, తదుపరి తరాల వారు కూడా రాఖీ వేడుకల్లో పాల్గొనడంతో గంగుల నివాసంలో పండుగ సందడి నెలకొంది. ప్రతి ఏటా రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులంతా కలుసుకోవడం తమ ఆనవాయితీ అని సోదరీమణులు తెలిపారు.

# ముఖ్యమంత్రికి రాఖీలు కట్టినమహిళా మంత్రులు...

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. అడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశిరెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశొడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు



కాంగ్రెస్లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉ పక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సత్యం ప్రకటించారు.

# ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్

మొదటిపేజీ తరువాయి...



ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ దాట్లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల నుండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజిగిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్వోబీ, ఆరోయూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎన్ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్గగిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

# చిన్నోడు తీసిన డ్రాలో కుటుంబానికి లక్కీ

మొదటిపేజీ తరువాయి...

లక్కీ డ్రా టోకెన్ను ఓ బాలుడితో తీయించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మి) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, = ఆడబిడ్డను ఆశీర్వదించాను' అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు. మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఎం-లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఎం-లాట్లకు 600 మంది లబ్దిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు




క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్ఫిట్' అని కేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్ఫిట్గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభు త్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటు ంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..



# పద్మశాలి సర్పంచ్‌లకు ఘన సన్మానం

## రాజీవ్‌నగర్ సర్పంచ్ మామిడాల లలిత--రాజేశంకు ఘన అభినందనలు

తాండూర్28: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బీసీ టైమ్స్, జన అధికార సమితి సంయుక్త ఆధ్వర్యంలో పద్మశాలి సర్పంచ్‌ల ఆత్మీయ అభినందన, సత్కార సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ గ్రామ సర్పంచ్ మామిడాల లలిత--రాజేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, మాజీ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, బీసీ టైమ్స్ సంపాదకులు సంగెం సూర్యారావు, కాంగ్రెస్ నాయకులు ఎరవర్తి అనిల్ కుమార్, తొలివెలుగు రఘు, కాళోజి శ్రీనివాస్, జనసేన నాయకులు సాగర్ తదితరులు రాజీవ్‌నగర్ గ్రామ సర్పంచ్ మామిడాల



లలిత--రాజేశంను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తూ ఆదర్శప్రాయమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలి సర్పంచ్‌లకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పరికిపండ్ల నరహరి హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# భారీగా హాష్ ఆయిల్, గంజాయి, డ్రగ్ ట్యాబ్లెట్లు స్వాధీనం

## 9 మంది యువకుల అరెస్ట్ రూ.6.50 లక్షల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం

**కరీంనగర్ ఆగస్టు 28:** బొమ్మకల్‌లోని నేచర్ క్యూర్ హాస్పిటల్ సమీపంలో కరీంనగర్ రూరల్ పోలీసులు దాడి చేసి భారీగా హాష్ ఆయిల్, గంజాయి, డ్రగ్ ట్యాబ్లెట్లు, సిరంజీలు, వినియోగ పరికరాలు, 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 20 నుంచి 25 ఏళ్ల వయసున్న తొమ్మిది మంది యువకులను అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల ప్రభుత్వ అంచనా విలువ సుమారు రూ.6.50 లక్షలు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి హాష్ ఆయిల్, గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్ పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అలాగే డ్రగ్ ట్యాబ్లెట్లను అక్రమంగా వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో సుమారు 500 గ్రాములు/మిల్లీలీటర్ల హాష్ ఆయిల్, 500 గ్రాముల గంజాయి, 60 డ్రగ్ ట్యాబ్లెట్లు, 14 సిరంజీలు ఉన్నాయి. నిందితులపై ఎన్ డిపిఎస్, ఏసిటీ విఆర్



యుజిఎస్ ఏసిటీతదితర చట్టాల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మత్తు పదార్థాలను విక్రయించే వారి సమాచారం పోలీసులకు అందించాలని యువతకు సూచించారు.

# లంబాడి తండాల్లో తీజ్ సందడి మొదలు...



**ప్రారంభమైన తీజ్ ఉత్సవాలు**
**గిరిజన సంస్కృతీసంప్రదాయలకు ప్రతీక**
**తొమ్మిది రోజులపాటు యువతుల పూజలు**
**ప్రకృతితో మమేకమై వేడుకలు**



**జననినాదం,సిర్పూర్(యు),ఆగష్టు 28:** తండాల్లో తీజ్ సంబరాలు మొదలయ్యాయి. గిరిజనుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. ప్రకృతిని ఆరాదిస్తూ ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. నమ్మ కాలు, సంప్రదాయాలను ఇప్పటికీ గిరిజనులు ఆచరిస్తున్నారు. గిరిజనుల పండుగల్లో తీజ్ ఉత్సవాలు ముఖ్యమైనవి. వర్షాలు మొదలవడంతోనే లంబాడీలు శీతల్, తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. బతుకమ్మ పండగ తరహాలో సాగిపోయే తీజ్ ఉత్సవాలు వారి సంప్రదాయాలకు అద్దం పడుతాయి.

### బతుకమ్మ తరహాలో ఉత్సవాలు

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వండుగలాగే తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. తీజ్ అంటే పచ్చని పంట లేదా నారుగా అర్థం వస్తుంది. తీజ్ బంజారాల మాతృదేవత మేరామాకు ప్రతిరూపంగా విశ్వసిస్తారు. బంజారాల సంస్కృతిలో ఏడుగురు మాతృదేవతలు ఉంటారు. వారిలో మేరా పెద్ద. ఆమె పైరు పంటలను రక్షిస్తుందని వర్షాలు కురిసి వేసిన పంటలు పుష్కలంగా పండి ధాన్యం ఇంటికి వస్తుందని భావిస్తారు. పచ్చని నారును మేరమా రూపంగా మలచి పండుగగా జరుపుకుంటారు. తొలకరి చినుకులు కురిసిన తరువాత తండా ప్రజలు అదును చూసి విత్తనాలు వేస్తారు. వచ్చగా పెరుగుతున్న పంటను చూసి తండా ప్రజలు తీజ్ ఉత్సవాన్ని జరుపుతారు. పంట ఏపుగా పెరిగే నాటికి జూలై చివరి నుంచి ఆగస్టు మాసం చివరి వరకు ఈ పండుగ నిర్వహిస్తారు. బంజారాలు భూమిని పంటను దేవత రూపంగా భావిస్తారు. తండా పెద్ద అనుమతితో ముత్తయి దువలు సూత్రదారులుగా బంజార యువతులతో పండుగ నిర్వహిస్తారు.

### నాలుగు దశల్లో పండుగ

తొమ్మిది రోజుల పండుగను నాలుగు దశలుగా నిర్వహిస్తారు. మొదట గోధుమలను బుట్టల్లో చల్లుతారు. దీన్ని 'తీజ్ బోరా యేరో' అంటారు. రెండోది కడావో దేవతకు నైవేద్యం సమర్పించడం. మూడోది 'గణ్ గోర్' అంటే మేరామా సేవాలాల్ పెళ్లి. నాలుగోది గోధుమ నారను చెరువులో వదులుతారు. వేరా యేరోగా పిలుస్తారు. బంజారా యువతులు గోధుమలు కొని సారవంతమైన మట్టిని తీసుకొచ్చి బావి దగ్గర నుంచి శుభ్రమైన నీటిని తెచ్చి పాటలు పాడుకుంటూ గోధుమలను నానబెడుతారు. పెద్దలు తీజ్ బుట్టలను తయారు చేసి ఇస్తారు. గోధుమలు నానబెట్టి వాటిని బుట్టల్లో వేసి యువతులు నృత్యాలతో పాటలు పాడుతూ వెళ్తారు. యువతులు గోధుమలు నానబెట్టి బుట్టలు వేసే పనిలో ఉంటే వారి అన్నదమ్ములు మంచె వేస్తారు. కింద ఉంటే నారును పశువులు తింటాయని ఎత్తుగా ఈ మంచె తయారు చేస్తారు. పెద్ద బుట్టను ఒక దాన్ని ఏర్పాటు చేసి మిగిలినవి చిన్న బుట్టలను ఉంచుతారు. నారు ఏపుగా పెరగడానికి ఉదయం మధ్యాహ్నాం సాయంత్రం క్రమం తప్పకుండా నీళ్లు పోస్తారు. ఉదయం, మధ్యాహ్నాం, సాయంత్రం నీళ్లు పోసే సమయంలో పాటలు పాడుతారు. 7వ రోజున సేవాలాల్‌కు శాఖహార నైవేద్యాన్ని సమర్పిస్తే మేరామా దేవత మాంసహార నైవేద్యాన్ని స్వీకరిస్తుంది. ప్రతీ కుటుంబం కొంచెం బియ్యం పిండిని దీక్షలో ఉన్న యువతులకు పంపిస్తారు. పిండి బెల్లం కలిపి యువతులు తీజ్ దగ్గరే నైవేద్యాన్ని తయారు చేస్తారు. దీన్ని బుజ్మా లాప్సీ అంటారు. ఈ పదార్థాన్ని నెయ్యితో కలిపి మంటలో వేస్తారు. బియ్యం పిండితో రొట్టె చేసి బెల్లంతో కలిపి ముద్ద చేస్తారు. దీన్ని చుర్మో అంటారు. మేరామా సేవాలాల్ పెళ్లి కూడా 9వ రోజు ఘనంగా జరుపుతారు. గణ్ అంటే భార్య గోర్ అంటే భర్త ఇలా గణ్‌గోర్ ఉత్సవంగా జరుపుతారు. సంప్రదాయంగా అలంకరించి పెళ్లి జరిపిస్తారు. దేవతలకు నైవేద్యం సమర్పించగానే మంచెమీద ఉన్న బుట్టలను అన్నదమ్ములు తీసుకొని పరుగు తీస్తారు. వారి వెంట అక్కాచెల్లెలు, అన్నదమ్ములు కూడా పరుగు తీస్తారు. బుట్టలోని నారు ఏమీ చెయ్యవద్దని తమకు ఇవ్వమని వేడుకునే కార్యక్రమం నిర్వహిస్తారు. దేవతకు ప్రతిరూపాలైన చిన్న బుట్టలను చిందర వందర చేస్తే శోక భరిత గీతాలను ఆలపిస్తారు. ఇలా అనేక విధాలుగా ఉత్సవాన్ని కొనసాగిస్తారు. తొమ్మిదో రోజున గోదుమ నారును చెరువులో వదులుతారు. చిన్న పీట మీద అన్నదమ్ములు అక్కచెల్లెళ్ల కాళ్లు కగిడి తమ ప్రేమానురాగాలను చాటుతారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు అనుబంధంగా పాటలు పాడుకుంటారు. తీజ్ ఉత్సవంలో పాల్గొనే యువతులకు మంచి భర్తలు వస్తారని, మంచి కాపురం ఉంటుందని భావిస్తారు.

### ఉప్పు కారం లేని ఆహారం

తీజ్ బుట్టల తయారీ నుంచి గోధుమ నారును చెరువులో వదిలి వేసే వరకు యువతులు ఉప్పు, కారం లేని ఆహారాన్ని తీసుకుంటూ దీక్ష చేపడతారు. బంజారాలు రోజంతా వ్యవసాయ పనులు ముగించుకొని సాయంత్రం వేల తీజ్ దగ్గరకు చేరి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. వారు పాడే పాటల్లో భక్తి పారవశ్యం కనిపిస్తుంది.

### ఆచారవ్యవహారాలకు ప్రాధాన్యం

లంబాడీలు, గిరిజనులు తమ భాష, ఆచార వ్యవహారాలను సజీవంగా కాపాడుకోవడానికి తపన పడుతూనే ఉన్నారు. చదువుకుంటున్న యువతుల వస్త్రధారణలో కొంత మేరకు మార్పులు వచ్చినా ఆచార వ్యవహారాలను పండుగల్లో మాత్రం పాటిస్తున్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో లంబాడీ మహిళలు కట్టు..బొట్టు విషయంలో పద్ధతులు మాత్రం వీడడం లేదు. ఇప్పటీ వృద్ధులు రంగు రంగుల దుస్తులపై అద్దాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. మణికట్టు మోచేతి భాగం వరకు పింగాని గాజులు ధరిస్తున్నారు. ఇప్పటికీ మెడకు వెండితో చేసిన పెద్దగా ఉండే హాసలి ధరించడం కనిపిస్తుంది. ఇలా ఆచార వ్యవహారాలను ఆరాధించే లంబాడీలు, బంజారాలు వ్యవసాయ పండుగలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. శీతల్, తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు.



## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

**గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**



**జననినాదం,జైనూర్ 28:** పట్నాపూర్ గ్రామంలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ సంత్ సద్గురు పూలాజీ బాబా 82వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం పరిశీలించారు. ఐటీడీఏ ఈఈ జాదవ్ తనాజీతో కలిసి ఉత్సవ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, పార్కింగ్, భక్తుల రాకపోకలు, భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

## డిజిటల్ రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు సులభతరం

**చోర్‌పల్లి సర్పంచ్ మర్సుకోలా అనసూయ జూగాదిరావు**



**జననినాదం,సిర్పూర్(యు),లింగాపూర్ఆగష్టు 28:** అర్హులైన ప్రతి రేషన్ లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా డిజిటల్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని సర్పంచ్ మర్సుకోలా అనసూయ జూగాదిరావు అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డుల ద్వారా రేషన్ సరుకులు పొందడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా పొందవచ్చన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరపున సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం నీలకాంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, రేషన్ డీలర్ ఆత్రం అంబుబాయి పాల్గొన్నారు.

## ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 28:** ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్ధవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ఎస్ ఐ ఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి ఆగష్టు 28:** ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, వంటశాల, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి బోధన, తరగతుల నిర్వహణ, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యానన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ విచారణలను పరిశీలించి ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో, నాబార్డ్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ సహకారంతో నిర్వహిస్తున్న పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం, అగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్టులో భాగంగా కోలాం గిరిజన కుటుంబాలకు మామిడి, ఉసిరి, పనస, జామ, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను ఉచితంగా అందజేశారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాలకు పౌష్టికాహారం, భవిష్యత్తులో అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి అనిత, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, మండల విద్యాధికారి, ఎఫ్‌పిసి ఛైర్మన్ ఎంబడి కిషన్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, సర్పంచ్‌లు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# గృహనిర్మాణాల కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి.28:** జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు గుడిసెల సర్వేను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణ శాఖ, డిఆర్డీఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు,మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, మున్సిపాలిటీ వారీగా మంజూరైన ఇళ్లు, నిర్మాణాల పురోగతి, పెండింగ్‌లో పనులు, గుడిసెల సర్వే తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లాకు 4,562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 851 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ఆర్‌సీసీ, రూఫ్ లెవెల్ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సెప్టెంబర్ 15 నాటికి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూపాలపల్లి మండలంలో అదనంగా 200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు, భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 1,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు.నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాని ఇళ్ల విషయంలో నిధుల సమస్య, లబ్ధిదారుల అనాసక్తి, సాంకేతిక లేదా ఇతర కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా నమోదు చేయాలని స్పష్టంచేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరుకు ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు గుడిసెల సర్వేను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి అర్హత కలిగిన కుటుంబం మిగిలిపోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.భాస్కర్ గడ్డ 2బీహెచ్‌కే లేఅవుట్‌లో సీవరేజ్, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి అవసరమైన పూర్తి వివరాలు, నిర్మాణాల పురోగతి, పెండింగ్ అంశాలు, లక్ష్యాల సాధనపై నివేదికలను సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, పీఆర్ ఈఈ విద్యా సాగర్,శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు, అన్ని మండలాల ఎంపిడిఓలు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధాల బంధం... రాఖీ

## ఘనంగా రాఖీ వేడుకలు.

**అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్**
**ప్రేమ, పరిరక్షణ బంధానికి ప్రతీక**



**జననినాదం,సిర్పూర్(యు),ఆగష్టు 28:** భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాచీనమైన, సాంస్కృతిక విలువలతో కూడిన పండగ. శ్రావణ మాసం పూర్ణిమా రోజున ప్రతి భారతీయ కుటుంబంలో ఘనంగా జరుపుకునే పండగ 'రాఖీ'. ఇది కేవలం సోదరి సోదరుల మధ్య బంధమే కాదు, అనుబంధాల శక్తిని గుర్తు చేసే ఒక పవిత్ర సందర్భం. రాఖీ పండగలో సోదరి రాఖీ కట్టి సోదరుడి రక్షకు దేవతల నుంచి ఆశీర్వాదాలు కోరుతూ, సోదరుడు జీవితాంతం సోదరిని కాపాడతానని హామీ ఇస్తాడు. ఈ పండగ పాఠాలు, కుటుంబ సంబంధాలు ఎంతగా ముఖ్యమో సూచిస్తుంది. సమాజంలో ఆప్యాయత, బంధాల విలువలు, పరస్పర బాధ్యతలు రాఖీ పండగ ద్వారా స్పష్టమవుతాయి. వందల ఏళ్ళ చరిత్రలోని ఈ సంప్రదాయం, ఇప్పటికీ మన జీవితాల్లో సాంఘిక ఐక్యతకు మేలుకోల్పుతోంది. ప్రస్తుతం రాఖీ కేవలం కుటుంబానికి మాత్రమే పరిమితి కాకుండా స్నేహితులు, బంధువుల మధ్య కూడా పంచుకునే సాన్నిహిత్య చిహ్నంగా మారింది. పిల్లలు, యువతలు ఈ పండగను ఆనందంగా, కొత్త రీతిలో జరుపుకుంటూ సంస్కృతిని నిలుపుతున్నారు. రాఖీ పండగ మన మనసుల్లో ప్రేమను, పరస్పర విశ్వాసాన్ని పునరుజ్జీవింపజేసే సందర్భం. ప్రతి రాఖీ ఒక ఆత్మీయ వాగ్దానం, జీవితాన్ని మధురంగా మార్చే బంధం.

**చరిత్రలో రాఖీ...**

రక్షాబంధన్ పండుగకు పౌరాణిక, చారిత్రక కథనాలు అనేకం ఉన్నాయి. మహాభారతంలో ద్రౌపది, శ్రీకృష్ణుడికి కట్టిన రాఖీ నుండి, చిత్తోర్ రాణి కర్నావతి హుమాయూన్ చక్రవర్తికి పంపిన రాఖీ వరకూ ఈ పండుగ రక్షణ, గౌరవం, సహాయ సహకారాల చిహ్నంగా నిలిచింది.

# ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు రాఖీ కట్టిన మంత్రి సీతక్క



**గోదావరిఖని28:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ హైదరాబాద్ నివాసంలో ఆత్మీయత నిండిన రాఖీ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి రాఖీ కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సోదర--సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక కుటుంబ అనుబంధం, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది.

## మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతిలపై అసత్య

# ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు



**సూర్యాపేట జిల్లా28:** కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల అభివృద్ధియే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు.?శుక్రవారం వార్డు కౌన్సిలర్ పాశం శ్రీను నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులుమాట్లాడారు.బిఆర్ఎస్ కార్యకర్త మాదాల ఉపేందర్ గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారని, ఆయన స్థాయి ఏంటో తెలుసుకొని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలపై విమర్శలు చేయాలని హితవు పలికారు.?ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం,అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఏవైనా సందేహాలు ఉంటే బాధ్యతాయుతంగా ప్రశ్నించాలే తప్ప,స్వార్థ రాజకీయాల కోసం వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ నియోజకవర్గంలో సాగించిన దందాలు, అక్రమాలపై తీవ్ర స్థాయిలో ప్రజల్లో వ్యతిరేకత రావడం వల్లే బిఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించి ఓడించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.నాయకులు ఇప్పటికైనా హద్దుమీరి మాట్లాడటం మానుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సమావేశంలో నాయకులు ఈదుల కృష్ణయ్య, కట్టబోయిన శ్రీనివాస యాదవ్, గుండెల సూర్యనారాయణ యాదవ్, మోడెం సైదుబాబు, కోట హరీష్, చీదెళ్ల హనుమంతరావు,యలగందుల శ్రీను, చింతలపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి -- కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రిఆగస్టు: 28:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ గారితో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి కి మరియు ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు."బేటీ బచావో -- బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు."బాలికను కాపాడుదాం -- బాలికను చదివిద్దాం -- బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం బాలికల్లో ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, కుటుంబ అనుబంధం పెంపొందించేలా ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ మరియు బాలికలు పాల్గొన్నారు.

## గృహనిర్మాణ, ఇంజనీరింగ్ అధికారులతో

# జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష




**సిద్దిపేట 28:** రెండుపడక గదులు నిర్మాణ ప్రక్రియ గురించి గృహనిర్మాణ మరియు ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో ఆయా మండలాల వారిగా నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలను సమీక్షిస్తూ, నిర్మాణంలో ఉన్న ఇండ్లను కాంట్రాక్టర్ తో చర్చించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే కాంట్రాక్టర్ పేమెంట్ సైతం సకాలంలో అందించాలని తెలిపారు. నిర్మాణం పూర్తైన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అసలైన లబ్ధిదారులకు అందించి ఆ ఇండ్లను ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రెండు పడక గదులను లబ్ధిదారులకు అందించిన ఇండ్లకు ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రెండు పడక గదులు గృహాలు పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖ, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పిడి భగవంత్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, అర్ అండ్ బి, డిఈ లు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కు రాఖీ కట్టిన కార్యాలయ సిబ్బంది.



**జయశంకర్ భూపాలపల్లి.ఆగస్టు 28:** రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ మహిళా సిబ్బంది జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహోదరత్వం, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రాశస్త్యాన్ని స్మరించుకున్నారు. కార్యాలయ విధుల నిర్వహణలో జిల్లా కలెక్టర్ అందిస్తున్న మార్గదర్శకత్వం, సహకారానికి మహిళా సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మహిళా అధికారులు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారి సంక్షేమం, భద్రతకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సీనియర్ సహాయకులు విజయ, అనురాధ, సుమలత, జూనియర్ సహాయకులు మౌనికతదితరులు పాల్గొన్నారు.

# శిశుగృహంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు..

**చిన్నారులతో రాఖీలు కట్టించుకున్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి**




**కరీంనగర్ ఆగస్టు 28:** కరీంనగర్ శిశుగృహంలోని చిన్నారులతో కలిసి జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులకు రాఖీలు కట్టించి, వారికి స్వయంగా మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ ప్రేమకు దూరంగా ఉన్న శిశుగృహ పిల్లల ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా సాగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రాకతో పిల్లలంతా ఎంతో ఆనందంగా, సందడి చేస్తూ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ వాత్సల్య ప్రొటెక్షన్ ఆఫీసర్ పూదరి శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సుందరగిరి సాయికిరణ్ గౌడ్, శిశుగృహ ఏఎన్ఎం మెట్టు రమాదేవి, కౌన్సిలర్ కీర్తి, శిశుగృహ ఆయాలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో పారమిత విద్యార్థుల సత్తా



**కరీంనగర్ ఆగస్టు 28:** హైదరాబాద్ అల్మాస్‌గూడలో ఈ నెల 23న తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-10 విభాగంలో 3వ తరగతి విద్యార్థి సి.హెచ్. ఈశ్వర సాయి, అండర్-8 విభాగంలో 2వ తరగతి విద్యార్థి డి. నిఖిల్ బంగారు పతకాలు సాధించగా, అదే విభాగంలో ఎం. శ్రేయాన్స్ కాంస్య పతకం సాధించాడు. విజేతలను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460